

# సృష్టిలోపం



వి.వి.సూర్యనారాయణ

అతడు ఫేక్టరీలో గుమాస్తా. అతడు ధరించే దుస్తులు చాలా చవకరకం కోవతులూ చొక్కాలున్నూ. నాల్గు సంవత్సరాలనుండీ అతని పాదాలాశ్రయించుకొన్న చెప్పులింకా ఆస్థానాన్నే ఆశిస్తున్నట్లున్నాయి. అతడు పనిచేసే వాతావరణంలో లాభనష్టాల్ని బేరీజువేసికొని బుర్రలు వేడెక్కించుకొనే మనుష్యులు ఎక్కువ. అతని మనస్సు అంతులేని అంకెల్లో పడి కొట్టుకొంటూ వుంటుంది. భౌతికదేహం రాక్షసి బొగ్గు మసి తగిలి మసిబారుతూ వుంటుంది. అతడు కురూపుల్లో కురూపి. ఆ వ్యక్తిని చూసినవాళ్లు యిట్టే అసహ్యించుకొని అవతలకు తొలగిపోతారు. ఎవరైనా, యెక్కడైనా ఒక క్రొత్తకురూప రేఖను చూడ్డం తటస్థిస్తే, అది రాజారావుముఖంలోనే గోచరమైవుండాలి!

దినపత్రికల్లోనూ, వారపత్రికల్లోనూ, సౌందర్యాన్ని వృద్ధిచేస్తాయని ప్రకటించబడ్డ బూటకపు ప్రకటనలెన్నో చదివేడు. ఆ మందుల్ని కొని వాడి చూశాడు. కాని ఫలితం శూన్యం. వీటితో విసిగి వేసారిన రాజారావుకి, అంకెలు కూడుకొంటూ, ఆఫీసులో తన కుర్చీ కంటుకు పోవడమే శరణ్యంలా తోచింది.

ఆశ్చర్యమేమిటంటే, ఆ రోజునతడు ఆఫీసులో కూర్చొని అలవాటు లేని పనిలోపడి కొట్టుకుంటున్నాడు. ఆ నాడు రాజారావు వ్రాసిన కాగితాలు చాలా వున్నాయి. కాని వాటిలో ఆఫీసు పనికి సంబంధించిన కాగిత మొక్కటీ లేదు! అతని మనః కవాటంలో చాలాకాలంనుండీ విముక్తి దొరకక బంధింపబడివున్న భావసామగ్రి అంతా పద్యరూపంలో ఆనాడు ఆఫీసు కాగితాలమీద ప్రతి ఫలించింది! ఆ రోజు నతడు వ్రాసిన పద్యాలన్నీ 'నల్లని వేణీభరముగల నళినాక్షి'కి ఉద్దేశింపబడినవే. అతడి భావాల్లో సహజోక్తులకే స్థానముందిగాని, ఉత్ప్రేక్షకిలేదు. అయితే 'యెవరయా యీ నళినాక్షి ?' అంటే అతడే సమాధానము యియ్యలేడు.

ఆఫీసుపని చెయ్యవలసిన సమయంలో పద్యాలు వ్రాస్తూ కూర్చోడమూ, ఆఫీసుపని వెనక్కు నెట్టడమూ పొరపాటే. దురదృష్టవశాత్తూ రాజారావు యీ పనిచేస్తూ మేనేజరు కళ్లబడ్డాడు. అప్పుడు చూడకపోయినా రాజారావు పద్యాలు వ్రాస్తున్నాడని ఎప్పుడు వినడం తటస్థించినా, మేనేజరు తప్పకుండా బాధపడతాడే కాని, సంతోషించే వ్యక్తికాడు. ఇది సాధారణముగా అధికారుల్లో వుండే గుణమే కనుక విపరీతముగా చెప్పుకోవలసిన అవసరమూ లేదు. రాజారావు కచేరీలో పనిచేయవలసిన కాలాన్ని యితరత్రా వినియోగిస్తూంటే చూస్తూ, చూస్తూ, తన అధికారాన్ని వినియోగించుకోకుండా వుండలేకపోయాడు, మేనేజరు.

'కంపెనీలో పనిచేయవలసిన సమయాన్ని నువ్వు యీ విధంగానేనా వినియోగించవలసింది?' అధికార స్వరముతో కోపముగా అడిగేడు, మేనేజరు-దగ్గరకొచ్చి, రాజారావువ్రాసిన పద్యాలుగల కాగితాల్ని తిరగేస్తూ. రాజారావేమీ మాట్లాడలేదు. 'నల్లని వేణీ భరముగల నా రాణి' అని రాజారావుకు వినపడేలాగే చదివేడు, ఒక శీర్షికను చూసి. తనను నలుగురిలోనూ వెక్కిరించి అవమానము చేయాలన్న సంకల్పముతో మేనేజరు అట్లా చదివి వ్యంగ్యంగా నవ్వుతున్నాడన్న విషయాన్ని గ్రాహ్యం చేసుకొన్న రాజారావుకి, అత

డట్లా చదవడం వినగానే ముఖమంతా రక్తం చిమ్మినట్లయింది. సిగ్గుతో అతని శిరస్సు వాలిపోయింది. అసలతడు వ్రాసిన పద్యాలెట్లాగున్నాయో, అతనికే తెలియదు—అందుచేతనే యింతవరకూ, తానొక కవినన్న గర్వం లేదతనికి. అది కాక అతడు ప్రత్యక్ష వ్యక్తినెవర్నీ ఉద్దేశించి వ్రాయలేదా పద్యాల్ని. తన ఊహానేత్రాని కందిన ప్రేయసి నుద్దేశించిచేసిన ఊహాగానమది. అందుకనే వ్యంగ్యార్థాన్ని స్ఫురింపజేసిన మేనేజరు వికటాట్టహాసం అతనికి వెగటనిపించింది. కూలికి కుదిరిన బానిస గనుక తగిన జవాబు చెప్పలేక తటపటాయించాడు.


'నీవాఫీసు కాలాన్నిట్లా వృథా చేస్తున్నందుకు నీకొక మంచి గుణపాఠం నేర్పాలి'. మళ్లా వినిపించింది అధికారి కర్కశ కంఠం, 'కాని నిన్ను ప్రస్తుతం నేనేమీ చేయదల్చుకోలేదు.' మరొక కాగితము తిరగేస్తూ అన్నాడు వికటంగా, 'మా కంపెనీలో నవ్యకవుల్ని పోగుచేస్తున్నట్లు నాకు తెలియదింతకాలమూను.' ఆ మాటల్లోని వ్యంగ్యం అర్థమైంది రాజారావుకి.

'అయినా యీ పద్యాల్ని నాతో తీసికొని వెళుతున్నా. నా భార్యకు యిటువంటి వాటిలో రసగ్రహణశక్తి అపారమని చెప్తూవుంటుంది ఈ రచన లెట్లా ఉన్నాయో ఆమె ఉద్దేశ్యము తెలిసికోవాలి. నీ వ్రాతలు నేననుకొంటున్నంత కంటకముగా ఉంటే రేపీపాటికి నువ్వు ఉద్యోగానికి నీళ్ళు వదిలి గేటుదాటడానికి సిద్ధంగా ఉండాలి.' ఆ కాగితాలన్నీ కట్టకట్టి కోటుజేబులో వేసుకొని పోయాడు మేనేజరు. రాజారావా సమయములో కళ్ళప్పగించి చూడ్డం తప్పితే వేరేమీ చెయ్యలేకపోయాడు.

ఇంతకీ చెప్పుకోతగ్గ విషయమేమంటే, మేనేజరుగారి భార్యా, కుమార్తే కలిసి రాజారావు వ్రాసిన పద్యాల్ని అభినందిస్తూ మరునాడు ఉత్తరం పంపించారు. అతని రచనల్లో స్వభావోక్తి ఉట్టిపడుతోందనీ, అందుకనే అవి తమకు ప్రీతికలుగజేశాయని, ఆ వార్త సారాంశం. అంతేకాకుండా తామటువంటి పద్యరత్నాల్ని చదవడానికి చాలా కుతూహల పడుతున్నందువల్ల ఎప్పటి కృషి ఫలితాన్ని అప్పుడు తమకు అందజేయవలసిందన్న ప్రోత్సాహ మిళితమైన సందేశాన్ని విన్నప్పుడు, అప్పటివరకూ తను అనుభవించి యెరుగని ఉత్సాహము కలిగింది రాజారావుకి. తన కవిత్వాన్నికూడా మన్నించి ఆనందించగలిగే వ్యక్తులు వేళ్ళమీద లెక్కపెట్టడానికైనా ఉన్నారని తెలిసేసరికి అతనికి ఎంతో విశ్రాంతి దొరికినట్లయినది! ఆనాటినుండే రాజారావు జీవితములో చెప్పుకోదగ్గ మార్పు ప్రారంభమైంది. అతడిప్పుడు కవిగా జీవితములో కొత్త అడుగువేశాడు. అతడు కూర్చిన ప్రతి పద్యములోనూ ప్రాధాన్యము ప్రేమభావానికే. అతడు సృష్టించే ప్రతీ శీర్షికలోనూ తీసికొనే వస్తువు అదొకటే. ప్రతీ కావ్యఖండములోనూ గోచరించే నాయిక 'నల్లని వేణీభరనుగల నళినాక్షి'. అతడేరోజున వ్రాసిన శీర్షిక ఆరోజునే తెప్పించుకొని చదివేది మేనేజరుకూతురు. అప్పుడప్పుడు తీరిక సమయాల్లో మేనేజరు భార్యకూడా కుతూహలముగా చదివేదతని రచనలను. రెండు మాసాల్లో ఆ పద్యాలన్నిటినీ పుస్తకరూపేణా అచ్చువేయించడముకూడా జరిగింది. ఈ పుస్తకాలను ముద్రించడములో మేనేజరు భార్యదే ముఖ్యమయిన పాత్ర అని చెప్పాలి. ఈ రెండు నెలలో ఆమె మొగుడు చెవిలో యిల్లు కట్టుకొని పోట్లాడింది. ఆమె బాధకు తట్టుకోలేక, మేనేజరు తనకు బాగా పరిచయస్థుడూ, స్నేహితుడూ అయిన పబ్లిషరుచేత ఆ పుస్తకాలు అచ్చువేయించడానికి చాతనైన సన్నాహమంతా చేయించాడు. మరి కొద్దిరోజుల్లోనే రాజారావు పేరు దేశంలో మారుమ్రోగిపోయింది. ఏ పత్రికలో చూచినా విమర్శకులు మంచి అభిప్రాయాన్నే యిస్తున్నారు. అతనికవితాశక్తిని అతిఘనముగా పొగుడుతున్నారు. రాజారావుకి యిటీవల అతని రచనవల్ల ఆదాయముకూడా వృద్ధిపొందింది. తాను గుమాస్తాగా చేరినప్పటినుండ నిలువ చేయగలిగినంత ధనము యీ కొద్దికాలములోనూ తన రచనలవల్ల సంపాదించగలిగేడు! తన రచనలు నిరాటంకముగా కొనసాగడానికి, ఆఫీసుపని అడ్డం వస్తున్నట్లు తోచింది రాజారావుకి. తనగుమాస్తా ఉద్యోగానికి రాజీనామా యిచ్చేస్తే కళాకాంతకు మరి కొంతసేవ చేయవచ్చుననే ఆశ అంకురించిందతనిలో. తన ఆదాయాన్ని కూడా యినుమడింప చేసుకోవచ్చు. ఒక్క దెబ్బకే రెండు

పిట్టలు! ఈ ఆలోచన సమంజసముగా ఉందనుకున్న రాజారావు ఆనాడే రాజీనామా కాగితాన్నందజేశాడు, తన అధికారికి. మరుసటి ఉదయంనుండి, రాజారావు ఆ ఫేక్టరీలో గుమాస్తా కాడన్నమాట! ఆఫీసులో అతడు కూర్చునేస్థలం ద్వారానికి పక్కనేవుంది. తాను వెళ్లిపోయేలోగా పూర్తిచేయవలసిన పనులన్నీ త్వరగా పూర్తిచేసుకొంటూ తలవంచుకొని కూర్చున్నాడు.

హటాత్తుగా తలుపు కదిలిన చప్పుడవడమును విన్న రాజారావు దృష్టి ఆ వైపుకు మళ్లింది. ఇరవై సంవత్సరాల సుందరాంగి తనకెదురుగా నిలిచింది. ఆమె యెన్నడూ రాజారావుని చూడ లేదు. అతడు మాత్ర మామెను చాలసార్లు, వీధిని పోతూ తన మేనేజరు యింటిలో చూశాడు. ఆ అమ్మాయి మేనేజరు కూతురనికూడా అతనికి తెలుసు. కాని అతడామె నింత దగ్గరగాయెప్పుడూ చూడలేదు, యింతకుముందెన్నడూ ఆమెతో మాట్లాడలేదు. ఆమెనుచూడగానే వ్రాస్తూన్న కలమాప్రక్కకుపెట్టి, 'నమస్తే! నాన్నగారికోసం వచ్చినట్లున్నారు. వారిక్కడలేరు. ఏదోపనిమీద వెళ్లేరు. మీ కభ్యంతరంలేకపోతే మీ పనినాతో చెప్పి సహాయంకోరవచ్చు' అన్నాడు రాజారావు.




'అవును- నాన్నగారు లేరన్నసంగతి తెలిసే వచ్చాను. ప్రస్తుతం నేనిక్కడికి రావడానికి కారణం...' కొద్దిగా తడబడిందామెగొంతుక. మళ్లా యేమనుకొందో యేమో, గిరుక్కున తిరిగి, కంఠం బాగా తగ్గించిఅంది, 'మీరు నాకు నిజంగా సహాయం చేస్తారా? అయితే మీ ఆఫీసులో రాజారావు అనే పేరుగలవ్యక్తి యెవరు? ఆ మూల కూర్చొనియేదో దీర్ఘాలోచనచేస్తూన్నాయనేనా?' రాజారావు మెల్లగా బుర్రత్రిప్పి ఆమె చూపిన వ్యక్తివైపు చూశాడు. 'కాదు' అన్నాడు. ఆమె మరొకనివైపుచూపి, 'అయితే తప్పకుండా ఆ పెద్ద టేబిలు దగ్గర కూర్చున్నాడే, సన్నగా దువ్విన నొక్కు నొక్కుల జుట్టుంది; అందంగా, ఆకర్షణీయంగాఉన్నాడు. ఆ అబ్బాయిఅయివుండాలి.'

'కాదు' అన్నాడు రాజారావు మరొకసారి.

'అయితే, యెవరు రాజారావు? అతనెక్కడ కూర్చుంటాడు? నేనాతని కవనాన్ని చదివిమెచ్చుకొన్న వాళ్లలో ఒకర్తెను. నాకిప్పుడతన్నిచూడాలనే కోరికచాలాబలంగాఉంది.'

రాజారావు కెందుచాతనో ముఖం ఎర్రబడిపోయింది. ఒళ్ళంతా చెమటలుపోశాయి. అపరి



మిత్రంగా బాధపడుతూ యేమిచెయ్యడమో తెలియని చిన్న కుర్రవాడి ముఖంలో కనిపించే బాధ అతనిముఖంలో ద్యోతకమైంది. ఒకసారి చుట్టూ కలయచూచి, ఆమెవైపుతిరిగి అన్నాడు. 'ఇక్కడ మీరాతన్ని కలుసుకోలేరేమో నని చెప్పడానికి చాలా విచారిస్తున్నాను.'

ఆమె వెళ్ళిపోయిన అనంతరం, రాజారావు తన టేబిలుముందు సావకాశంగా కూర్చున్నాడు. తన జేబులోంచి చిన్న అద్దం తీసి తన ముఖరేఖల్నొకసారి పరిశీలించి చూసుకున్నాడు. తన ముఖం తనకళ్ళకే చాలా అందవికారంగా కనిపించింది. అద్దం పక్కకు పెట్టేశు. తను చేసినపని తల్చుకుంటే తనకే చాలా బాధగాఉంది. తనే రాజారావన్న సంగతి ఆమెకు తెలియకుండా ఉండడం అవసరమని అతని మతం. తనే ఆమె అభిమానకవి యని ఆమెకు తెలుస్తే, ఆమెముఖంలో కనబడే బాధామిళితమైన ఆశ్చర్యాన్ని తను చూసి సహించలేడు. అందుకే ఆసన్నివేశం రాకుండా తప్పించుకున్నాడు. ఇప్పుడు క్రొత్తగా అతడు తెలిసికొన్నదేమంటే, ఆఅమ్మాయి వేణి తుమ్మెద రెక్కలలాగా నల్లగా, కారునలుపు ఛాయలో ఉంది. అతని పదాల్ని చదివితే స్ఫురించే నల్లని వేణీభరముగల నళినాక్షిలోని సౌందర్యరేఖలామెలో కనిపించాయి, రాజారావుకి.

ఆసాయంత్రం రాజారావుగుమాస్తాఉద్యోగానికి స్వస్తిచెప్పి యింటికి వచ్చేశాడు. అప్పటినుండి ఆ ఫేక్టరీకీ, అతనికీ ఏవిధమైన సంబంధమూ లేదు. ఇంటిదగ్గర కూర్చొని కలం తీశాడు పద్యరచనకి. మేనేజరు కూతురు కళ్ళకు కనిపించినట్లయింది. కలం ముందుకు సాగలేదు.

తరవాత రాజారావు పద్యరచనకి యెప్పుడు పూనుకున్నా సరే, మేనేజరు కూతురు సౌందర్య విగ్రహం తన కళ్ళముందు శూన్యంలో నాట్యంచేసేది. ఆవిషమపరిస్థితిలో అతని కలం పూర్వంలాగా పరవళ్లు త్రొక్కలేకపోయేది.

రాజారావిప్పుడు కంపెనీలో గుమాస్తాకాడు. కవి కాలేకపోతున్నాడు. తను సంపాదించిన డబ్బు ఖర్చయిపోయింది. ఇప్పుడు తన జీవితానికి అవసరమైనధనమే సంపాదించలేకుండాఉన్నాడు. అతడు పూర్వం మల్లే గుమాస్తాకాడు, కవి కాడు. ఇప్పుడతడు అంద వికారియైన ఒక బికారి.

# ప్రజల ప్రయాణ సౌకర్యాలు

బులుసు వేంకటరమణయ్య

ప్రజాసామాన్యానికి అత్యవసరాలయిన ప్రయాణ సౌకర్యాలు రెండు : ఒకటి - రైల్వే ; రెండు బస్సులు. ఇందులో మొదటిది కేంద్ర ప్రభుత్వం కిందా, రెండోది రాష్ట్రప్రభుత్వం కిందా ఉన్నాయి.

పెద్దపెద్ద వుద్యోగస్థులకీ, ధనాఢ్యులకీ యివి అవసరమే లేదు. ఏమంటే వారికి దూరప్రయాణాలకి విమానా లుంటాయి ; దగ్గిర ప్రయాణాలకి మోటారుకార్లు ఉంటాయి. అమ్మకు చిక్కిన మేకలు బీదలూ, మధ్య తరగతివారున్నూ.

రైల్వేలకు డబ్బు వస్తున్నది అధికంగా - మూడో తరగతి ప్రయాణీకులవల్లనే. వారికి తగిన సౌకర్యాలు లేకపోయినా కడచిన పదేళ్లలోనూ ఛార్జీలు అధికమైనాయి. రాత్రిళ్లు ఆబళ్ళలో దీపాలు లేకపోయినా, దొడ్లలో నీళ్లులేకపోయినా, జనం క్రిక్కిరిసి వున్నాగానీ, టిక్కట్లు యివ్వడం ఆపుచెయ్యకుండా, జనాన్ని లోపలికి - బస్తాలలో కూరినట్లు తోస్తున్నా, మెయిలు, ఎక్స్ప్రెసు ట్రయినులలో మూడో తరగతి పెట్టెలు రెండు, మూడిటికంటె ఎక్కువలేకున్నా - అడిగేవాడు లేడు. ప్రయాణికులు మొరపెట్టినా వారిది అరణ్యరోదనమేగాని సఫలమైనది కాజాలదు. పయివాటికి తోడు రైల్వే దత్తపుత్రులయిన బిచ్చగాళ్లూ, బియ్యపుమూటల్ని దొంగతనంగా రవాణా చేస్తున్న వందలాది బీదవ్యాపారస్థులూ తమ హక్కయినట్లు మూడో తరగతిలోనే ప్రవేశిస్తారుగాని పై తరగతుల జోలికేపోరు. సామాన్య ప్రజలకు యీ సౌకర్యాలు చాలుననే కేంద్ర మంత్రులకీ, పెద్ద వుద్యోగులకీ తోచడంలో ఆశ్చర్యంలేదు. ఏమంటే,